సీఆర్‌పీఎఫ్ సేవలు అమోఘం


రక్తదానం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

చాంద్రాయణగుట్ట: దేశ రక్షణ సేవలో సీఆర్‌పీఎఫ్ దళం సేవలు అమోఘమని రెండో సిగ్నల్ కమాండెంట్ ఓం హరి అన్నారు. సీఆర్‌పీఎఫ్ రెండో సిగ్నల్ బెటాలియన్ 56వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కేంద్ర పారామిలిటరీ బలగాలలో సీఆర్‌పీఎఫ్‌ది ప్రత్యేక స్థానమన్నారు. ప్రతి యేటా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదానం చేస్తూ అత్యవసరమైన వారికి ప్రాణదాతలుగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఉత్తమ్ బెనర్జీ, రెడ్‌క్రాస్ సంస్థ వైద్యులు వెంకట్‌రెడ్డి, పరమేశ్వర్, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల్లో కుల వివక్ష ఉండరాదు


హైకోర్టు ప్రాంగణంలో నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

చార్మినార్: ఇటీవల దేవరకొండ బార్ అసోసియేషన్‌లో ఎస్సీ న్యాయవాదులపై జరిగిన కుల వివక్షని, అంటరానితనాన్ని నిరసిస్తూ మంగళవారం హైకోర్టు ప్రాంగణంలో కొంత మంది న్యాయవాదుల బృందం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాదులు దేశాల భూపాల్, పిరంగల గణేష్, మంచర్ల విష్ణు, రవికుమార్, శరత్, బలేందర్, బాబన్న, విజయ్ తదితరులు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా న్యాయవాదులు అందరూ ఐక్యంగా ఉండాలని న్యాయవాదులు కోరారు. న్యాయవాదుల మధ్య కుల, వర్ణ వివక్ష, అంటరాని తనం ఉండొద్దన్నారు.

పూడికతీత ఎక్కడ..?


డబీర్‌పురా ఓపెన్ నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- పూడికతీత చేపట్టకపోవడంతో తలెత్తుతున్న సమస్యలు
- కచ్చామోరీలు, డ్రైనేజీలు, ఓపెన్ నాలాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

చార్మినార్: ఓపెన్ నాలాలతో పాటు క్లోజ్‌డ్ డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సకాలంలో తొలగించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఓపెన్ నాలాల్లో అక్కడక్కడ చెత్త పేరుకుపోవడంతో వరద నీరు సాఫీగా ముందుకు వెళ్లకపోవడంతో రోడ్లపై వరద నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. తద్వారా లోతట్టు ప్రాంతాల ప్రజలతో పాటు వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. వర్షాకాలానికి ముందే పూడికతీత పనులు చేపట్టినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా కనిపిస్తోంది.

పూడికతీత పనుల పేరుతో టెంటర్లు కాజేస్తున్న కొంతమంది కాంట్రాక్టర్లు క్షేత్రస్థాయిలో తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. జలమండలి అధికారులతో పాటు సిబ్బంది సరైన చర్యలు తీసుకోకపోవడంతో వర్షాకాలంలో స్థానికులకు సమస్యల తిప్పలు తప్పడం లేదు. పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, మరికొన్ని ప్రాంతాల్లో జలమండలి పర్యవేక్షణలో మురికినాలాలున్నాయి. నాలాలలో చెత్త పేరుకుపోవడంతో దంచికొట్టే వర్షాలకు వరదనీరు ముందుకు వెళ్లడానికి వీలు లేకపోవడంతో పొంగి రోడ్లను ఆక్రమిస్తోంది.

లోపిస్తున్న ఉన్నతాధికారుల పర్యవేక్షణ..

ప్రతి ఏడాది వర్షా కాలానికి ముందే సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులు పూడికతీత పనుల కోసం నిధులను వినియోగిస్తున్నారు. ఈ నిధుల వినియోగం సక్రమంగా జరగడం లేదు. నామమాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్న కాంట్రాక్టర్లపై సంబంధిత ఉన్నతాధికారుల నిఘా కొరవడుతోంది. దీంతో తూతూమంత్రంగా పనులు చేస్తున్నారు. పూడికతీత పనులు సక్రమంగా జరగకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటే.. సమస్యలు ఉత్పన్నం కావని లోతట్టు ప్రాంతాల బాధితులు అంటున్నారు.

ప్రజల్లో అవగాహన అవసరం..

ఓపెన్ నాలాల్లో స్థానికులు తమ ఇళ్లల్లోని చెత్తాచెదారం వేయకుండా ఉండాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు. ఓపెన్ నాలాలకు ఇరువైపుల గృహాలు నిర్మించుకుని జీవిస్తున్న స్థానిక ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలంటున్నారు. ఎట్టి పరిస్థితులలో చెత్త వేయొద్దు. ఒకవైపు ప్రభుత్వం ఓపెన్ నాలాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తుండగా.. మరోవైపు స్థానికులు తమ ఇళ్లు, దుకాణాల్లోని పనికిరాని చెత్తను ఓపెన్ నాలాల్లో వేయడం సరైంది కాదంటున్నారు. అయితే ఓపెన్ నాలాల్లో చెత్త వేయకుండా స్థానిక ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం సంబంధిత అధికారులు, సిబ్బందిపై ఉంది.

వేసవిలోనే పూడికతీత పనులు పూర్తి చేయాలి..

వేసవి కాలంలోనే నాలాలలో పూడికతీత పనులు పూర్తి చేస్తే వరద సమస్యలు తలెత్తవు. చెత్తాచెదారాన్ని తొలగించడానికి సంబంధిత అధికారులు కాలయాపన చేస్తుండడంతో వరద సమస్యలు తలెత్తుతున్నాయి. అక్కడక్కడ వర్షాకాలానికి ముందుగానే ఓపెన్ నాలాలలో పూడికతీత పనులు చేస్తున్నప్పటికీ..నామమాత్రంగా జరుగుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షన లోపం కారణంగా పూర్తిస్థాయిలో పనులు జరగడం లేదు. దీంతో వర్షాలు కురిసినప్పుడల్లా..లోతట్టు ప్రాంతాల ప్రజలకు సమస్యలు తలెత్తుతున్నాయి.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



చార్మినార్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుంచి తమను తాము కాపాడుకోవాలని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపరాదని పేర్కొన్నారు. ఇక చిన్నారులకు వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వొద్దని..మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే శిక్ష తప్పదన్నారు.

మౌలానా మతీన్ అలీషాకు మాతృవియోగం

గోల్కొండ: కుతుబ్‌షాహీ ఈద్గా ఖతీబ్, ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ తల్లి గౌసియా బేగం(90) మంగళవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంగా బాధపడుతున్న ఆమె మంగళవారం ఉదయం దిలావర్‌షానగర్‌లోని స్వగృహంలో మృతి చెందారు. ఆమె మృతి పట్ల ఎమ్మెల్యే కౌసర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం నయాకీలాలోని జమాలికుంట ముస్లిం శ్మశానవాటికలో జరిగాయి.

సన్మానం



అబిడ్స్: వాటర్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిత్తల్‌ను వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నూతనంగా పదవీబాధ్యతలు స్వీకరించిన ఆయనను యూనియన్ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణతో పాటు పలువురు నాయకులు ఘనంగా సత్కారం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజలకు వాటర్ బోర్డు ఆధ్వర్యంలో మెరుగైన మంచినీరు, ఇతర సేవలు అందించాలన్నారు. యూనియన్ నాయకులు సీహెచ్.జంగయ్య, కొమురయ్య, షబ్బీర్, రాజ్‌కుమార్, అంజయ్య, శంకర్, ప్రేమ్, మల్లేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో 'కుంభ్ కాన్‌క్లేవ్'


కుంభ్ కాన్‌క్లేవ్‌లో శ్రీవిద్యారెడ్డి, మాధవీలత తదితరులు

గోల్కొండ: భారత సంస్కృతి ఎంతో ఉన్నతమైనదని జీఎన్ఐటీఎస్ వైస్ చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి అన్నారు. మంగళవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియా సింక్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కుంభ్ కాన్‌క్లేవ్ కార్యక్రమం జరిగింది. ఆలయాలు, తీర్థయాత్రలు ఇండియా ఆర్థిక పరిస్థితి తదితర విషయాలపై ఈ కుంభ్‌లో పలువురు మేధావులు చర్చించారు. ఈ సందర్భంగా శ్రీవిద్యారెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలో కుంభమేళాలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఈ సమావేశానికి ఇండియా సింక్ కౌన్సిల్ డైరెక్టర్ సౌరబ్ పాండే హాజరై కుంభ్ విశేషాలను వివరించారు. బికనేర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ మనోజ్ దీక్షిత్, విశ్రాంత ఐఏఎస్ అధికారి అవనీష్ అవస్తి, కాశీవిశ్వనాథ్ ఆలయ సీఈవో విశ్వభూషణ్ మిశ్ర, డాక్టర్ సునీల్ శుక్లా, సెంట్రల్ సంస్కృత్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాస వరకేడి, లతమ్మ ఫౌండేషన్ ట్రస్టీ మాధవిలత, రవికాంత్‌రెడ్డి, జీఎన్ఐటీఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పునరావాసం కల్పిస్తేనే ఖాళీ చేస్తాం


బాధితులకు సర్దిచెప్తున్న ఇన్‌స్పెక్టర్ రాంబాబు

నాంపల్లి: కూలడానికి సిద్ధంగా ఉన్న మాన్గార్ బస్తీ వాంబే గృహాల్లో నివాసం ఉంటున్న పేదలను ఖాళీ చేయించేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు విఫలం చెందారు. ప్రత్యామ్నాయంగా పునరావాసం కల్పించకుండా బలవంతంగా ఖాళీ చేయిస్తే తామెక్కడికి వెళ్లాలంటూ నిరుపేదలు రెవెన్యూ అధికారులను నిలదీశారు. ఈ సమస్య రెవెన్యూ అధికారులకు, పోలీసులకు పెను సవాల్‌గా మారింది. మల్లేపల్లి డివిజన్‌లోని అఫ్జల్‌సాగర్, మాన్గార్ బస్తీలో ప్రభుత్వం గతంలో ఎనిమిది బ్లాకుల్లో మొత్తం 288 ఇళ్లను నిర్మించారు. ఈ ఇళ్లన్నీ ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. ఇప్పటికే అధికారులు శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు స్థానికులు బేఖాతరు చేస్తూ శిథిల గృహాల్లోనే నివాసం ఉంటామంటున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో హైదరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి మహిపాల్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు బస్తీలోకి వచ్చి గృహాలను ఖాళీ చేయాలంటూ పట్టుబట్టారు. బాధితులు ఖాళీ చేసేందుకు ఇష్టపడలేదు. బస్తీ వాసులకు పునరావాసం కల్పించాలనే ఆలోచన అటు అధికారులకు, ఖాళీ చేయాలనే యోచన బస్తీ వాసులకు లేకుండా పోయింది.

పేదలకు గొడుగుల వితరణ



నాంపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ వ్యవస్థాపకుడు, ఉత్తర భారత సంఘం మాజీ చైర్మన్, అశోక్‌సింగ్ 12వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నాంపల్లిలో కాంగ్రెస్ యువ నాయకులు మురళీమోహన్ సింగ్ నిరుపేదలకు గొడుగులను పంపిణీ చేశారు. ప్రతి ఏటా అశోక్ సింగ్ పేరిట పలు రకాల సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు మురళీమోహన్ సింగ్ తెలిపారు.

విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలి


వెంకటేశ్ గౌడ్

శాలిబండ: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో విద్యుత్ ప్రమాదానికి గురి కాకుండా వినియోగదారులు, విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎస్‌పీడీసీఎల్ మీరాలం సబ్ డివిజన్ ఆపరేషన్స్ ఏడీఈ కె.వెంకటేశ్‌గౌడ్ సూచించారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ..గాలి, దుమారం వచ్చినా, గాలితో కూడిన వర్షం వచ్చినప్పుడు విద్యుత్ తీగల కింద, ఐరన్ పోల్స్‌కు దగ్గరగా ఉండొద్దన్నారు. ఏదైనా లైన్‌లో ఎలాంటి సమస్య మీ దృష్టికి వస్తే మాకు తక్షణమే సమాచారం అందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఎట్టి పరిస్థితుల్లో చెత్తాచెదారాలు వేయకూడదన్నారు. అపార్ట్‌మెంట్, ఇంటికి సరైన ఎర్తింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా మా డిపార్ట్‌మెంట్ ఆయా ఏరియా ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌లకు 1912కి గానీ, ఏఈలకు గానీ, ఏడీఈకి గాని కాల్ చేస్తే సమస్య వెంటనే పరిష్కారం అవుతుందన్నారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి


విజేతలతో శ్రీజ ఆకుల తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని ఒలింపియన్ క్రీడాకారిణి శ్రీజ ఆకుల అన్నారు. మూడు రోజులుగా ఎల్బీస్టేడియంలో విశ్రాంత టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఆధ్వర్యంలో జరుగుతున్న 4వ టేబుల్ టెన్నిస్ తెలంగాణ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టేబుల్‌టెన్నిస్ ఇండియన్ కోచ్ మహ్మద్ ఇబ్రహీంఖాన్, టీఎస్‌టీటీఏ ప్రధాన కార్యదర్శి నాగేందర్ రెడ్డి, సలహాదారు ప్రకాష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గన్‌ఫౌండ్రీ: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమ్‌రెడ్డి దిలీప్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం గురుకులాల నూతన కార్యదర్శి తఫీర్‌ఇక్బాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గురుకులాలలో నెలకొన్న సమస్యల గురించి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రేడ్-1 ప్రిన్సిపాల్ పోస్టుల మంజూరు, జేఎల్ గణిత పోస్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంస్థ ఆర్గనైజింగ్ సెక్రెటరీ విద్యాసాగర్, పి.విజయ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



జగన్మోహన్‌రావుకు డాక్టరేట్

గన్‌ఫౌండ్రీ: శ్రీరామకృష్ణ నాట్యమండలి వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ జగన్మోహన్‌రావుకు గౌరవ డాక్టరేట్ దక్కింది. 52 ఏళ్లుగా నాటక కళారంగంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి చెన్నై గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ మంగళవారం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ..నాలుగు తరాల నుంచి కళాసేవ చేస్తున్న తనకు డాక్టరేట్ ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తన చివరి శ్వాస వరకు కళాసేవ కోసమై పనిచేస్తానని నాటకరంగ వ్యాప్తికి కృషి చేస్తానని తెలిపారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

యాకుత్‌పురా: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్‌నగర్ సర్కిల్-07 డిప్యూటీ కమిషనర్ శైలజా తెలిపారు. మంగళవారం ఆమె సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి దోమల నివారణ చర్యలపై మలేరియా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ..విష జ్వరాల నియంత్రణకు జోనల్ కమిషనర్ వెంకన్న ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏఈ భారతి, సూపర్‌వైజర్ మహేష్ ఉన్నారు.



భారీ ఎత్తున సహాయక చర్యలు చేపట్టాలి


బల్దియా కమిషనర్ ఆమ్రపాలితో మాట్లాడుతున్న మజ్లిస్ ఎమ్మెల్యేలు కౌసర్, ముబిన్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం భారీ వర్షాలకు అతలాకుతలం అయిందని వెంటనే భారీ ఎత్తున సహాయక చర్యలు చేపట్టాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన మజ్లిస్ ఎమ్మెల్యే ముబిన్‌తో బల్దియా కమిషనర్ ఆమ్రపాలిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వర్షాలకు కార్వాన్ నియోజకవర్గంలో తలెత్తిన సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు కూడా సమర్పించారు. లంగర్‌హౌస్, గోల్కొండ, నానల్ నగర్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరు నిలిచి ఉందని అదే విధంగా టోలిచౌకీ చౌరస్తాలోని షాపులు, రెస్టారెంట్లల్లో ఇంకా వర్షపు నీరు రెండు అడుగుల మేర నిలిచి ఉందని ఆమె దృష్టికి తెచ్చారు. గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్‌లలో రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయి గుంతలమయంగా మారయని ఈ రోడ్లపై వాహనాలు నడపాలంటేనే వాహనాదారులు భయపడుతున్నారన్నారు. కాగా వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన పనులు చేయిస్తానని ఈ సందర్భంగా కమిషనర్ హామీ ఇచ్చారు. అదే విధంగా కొత్తగా సమర్పించిన ప్రతిపాదనలను సైతం ఆమె ఆమోద ముద్ర వేశారు.

నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు దోహదం


మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

సుల్తాన్‌బజార్: నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి అన్నారు. మంగళవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బడిచౌడిలోని అవినాష్ కాలేజీలో నేను సైతం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, కళాశాల ఓఎస్‌డీ కపిల్, ప్రిన్సిపాల్ జ్యోతి ద్వివేది, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచార్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు ఏర్పాటుతో రక్షణ, భద్రతతో పాటు తమ పరిసరాలలో ఎటువంటి ఘటనలు జరిగినా వాటిని కెమెరాలలో చూసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ ఎస్ఐలు మధుసూదన్, నరేష్, శ్వేతలతో పాటు పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దాం


కొడి మహేందర్

చార్మినార్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఎప్పటికప్పుడు అందజేసే సూచనలు, సలహాలను పాటిస్తూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి కొడి మహేందర్ అన్నారు. ఈనెల 7న ప్రారంభమయ్యే వినాయక ఉత్సవాల కోసం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అనంత చతుర్దశి అయిన 17న నిమజ్జనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడానికి ముందుగానే కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్ రావు

గౌలిపురా: ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని గౌలిపురా జ్ఞాన భారతి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త వి.ప్రభాకర్‌రావు సూచించారు. మట్టి గణపతే మహా గణపతి..మట్టి గణపతులనే పూజిద్దాం... జలాశయాలను కాపాడుకుందాం అనే నినాదాలతో మంగళవారం పాఠశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో మట్టి గణపతుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 148 మంది విద్యార్థులు ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.రాజశేఖర్, ప్రిన్సిపాల్ ప్రభాకర్ ఆధ్వర్యంలో గణపతులను తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ..మట్టి గణపతుల ఆవశ్యకత, చెట్ల పెంపకం, పూజించే ఆకులు, పూల వివరాలు తెలుపుతూ చెట్లు, మొక్కలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీ నాగ కుమారి, ప్రసన్నలక్ష్మి, స్నేహ, శ్రీధర్, ప్రభ, అవంతి కులకర్ణి, మమత, శ్రీశైలం పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



అబిడ్స్: మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. వర్షాలతో ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులకు అన్నివిధాల సహాయాలు అందించేందుకు మత్స్యశాఖ సిద్ధంగా ఉందన్నారు. మత్స్యకారులకు అండగా ఉండేందుకు చైర్మన్ మెట్టు సాయికుమార్, కమిషనర్ డాక్టర్ ప్రియాంక ఆల హెల్ప్‌లైన్ నెంబర్‌ను ప్రారంభించారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ..మత్స్యకారులు ఎలాంటి సమస్యలు ఉన్నా హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేస్తే 24 గంటల పాటు సేవలందిస్తామన్నారు.

ఆత్మ నిర్భర్ భారత్‌ను మరింత ముందుకు తీసుకువెళ్తాం


లబ్ధిదారులను అభినందిస్తున్న ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ చైర్మన్ మనోజ్‌కుమార్

అబిడ్స్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఆత్మ నిర్భర్ భారత్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లే దిశగా అడుగులు వేస్తున్నామని ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ చైర్మన్ మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. ముచింతల్‌లో 300 మంది కుమ్మరులకు ఆయన పోటర్ వీల్స్, శిక్షణ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ..ఆత్మ నిర్భర్, విక్షిత్ భారత్ ప్రచారంలో గ్రామీణ కళాకారులు అంతర్భాగంగా మారుతున్నారన్నారు. తెలంగాణలో క్విక్ గ్రామోద్యోగ్ వికాస్ యోజన విజయాన్ని ఆయన వివరించారు. మూడేళ్లలో క్విక్ 1240 మంది కళాకారులకు శిక్షణ ఇచ్చిందని, ఆకు పలకల తయారీ, చింతపండు ప్రాసెసింగ్, తేనే మిషన్, పాదరక్షల తయారీ, టర్న్‌వుడ్ వంటి వివిధ రంగాల్లో 2084 టూల్ కిట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా వేస్ట్‌వుడ్ క్రాఫ్టులు, ఎలక్ట్రీషియన్, ప్లంబర్ సేవలు, ఎలక్ట్రిక్ పోటర్ వీల్స్ తదితర వాటిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఉపకార వేతనాలను పెంచాలి: ఆర్.కృష్ణయ్య


సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు

గన్‌ఫౌండ్రీ: పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఉపకార వేతనాలను పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి విద్యార్థుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు రెండేళ్లుగా బకాయిలు ఉన్న రూ.4,500 కోట్ల ఫీజులను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లను పెంచాలన్నారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. శాసనమండలి సభ్యుడు కోదండరాం మాట్లాడుతూ విద్యార్థుల డిమాండ్ సమ్మతంగానే ఉందని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీల పట్ల చిత్తశుద్ధితో ఉందని, బీసీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు వేముల రామకృష్ణ, నీల వెంకటేశ్, గుజ్జ సత్యం, నందగోపాల్, రాజ్‌కుమార్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.